ముురిపిస్తున్న ముందస్తు వర్షాలు



ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు



గోదాములో వేరుశనగ విత్తన కాయలను నిల్వ చేస్తున్న దృశ్యం

- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- సేద్యపు పనుల్లో నిమగ్నం

ధర్మవరం రూరల్: ఈ ఏడాది ముంగారు వర్షాలు రైతులను మురిపిస్తున్నాయి. ఖరీఫ్‌కు ప్రారంభం ముందే విస్తరంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌కు అటు వ్యవసాయ శాఖ అధికారులు, ఇటు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం ఏ పంటలను ఎంత విస్తీర్ణంలో సాగు చేయవచ్చునన్న అంచనాలతో వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఏడాది ఖరీఫ్‌ను పోల్చుకుంటే ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరగనున్నట్లు అంచనాలు రూపొందించుకుంటున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో ఇప్పటికే అదునుకు తగ్గట్టుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలాలను దుక్కులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ముందుగానే రైతులకు అవసరమైన విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసింది. ఎరువుల సరఫరాపై కూడా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాతావరణ శాఖ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పడంతో ఖరీఫ్ సాగు జోరుగా సాగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

మే నెలలోనే మొదలైన వర్షాలు

మే నెలలోనే తొలకరి పలకరించడంతో విత్తనాలు వేసేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. 2024 ఖరీఫ్ సాగు ప్రణాళికలను ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల వారీగా సిద్ధం చేశారు. పంటల ప్రణాళికతో వివరాల ప్రకారం ధర్మవరం నియోజకవర్గంలో అధిక శాతం మంది రైతులు వేరుశనగ, కంది పంటలను సాగు చేసుకునే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గతేడాది వేరుశనగ 37600 హెక్టార్లు, కంది 29800 హెక్టార్లలో సాగు చేశారు.

గతేడాది ధర్మవరం నియోజకవర్గంలో పంటల సాగు వివరాలు(హెక్టార్లలో)

మండలం	వేరుశనగ	కంది
ధర్మవరం	11,000	9,000
బత్తలపల్లి	5,000	3,000
తాడిమర్రి	9300	7,200
ముదిగుబ్బ	12,300	10,600

విత్తన వేరుశనగ సిద్ధం

వేరుశనగ క్వింటాలు పూర్తి ధర రూ.9,500 కాగా సబ్సిడీ రూ.3,800 పోను రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది. సబ్సిడీ పోను ఒక బ్యాగు రూ.1,710 చెల్లించాల్సి ఉంటుంది. అర ఎకరాలోపు విస్తీర్ణం గల రైతులకు ఒక బ్యాగు, అర ఎకరా నుంచి ఒక ఎకరాలోపు విస్తీర్ణం గల రైతులకు రెండు బ్యాగులు, ఒక ఎకరం పైన విస్తీర్ణం గల రైతులకు మూడు బ్యాగులు చొప్పున పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆర్బీకేలకు విత్తనకాయలు సరఫరా చేసింది.

దుక్కులు చేశాను



ఐదు రోజుల క్రితం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పొలాన్ని దుక్కులు చేసుకున్నాను. ఐదు ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేయడానికి విత్తనాన్ని సిద్ధం చేసుకుంటున్నా. అంతర పంటగా కంది సాగు చేస్తాను. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురుస్తాయని అనుకుంటున్నాం. వర్షాలు వస్తే ముందస్తుగా పంట సాగు చేస్తాను.

– సాకే నారాయణ, రైతు చిగిచెర్ల

సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



గతేడాది కంటే ఈ ఏడాది వేరుశనగ, కంది పంటల సాగు విస్తీర్ణం బాగా పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా విత్తన కాయల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పంటలను సాగు చేసుకునే వారు విత్తనశుద్ధిని తప్పక చేసుకోవాలి. విత్తనం వేయక ముందు వర్షం వస్తే రైతులంతా పొలాల వద్ద సామూహికంగా మంటలు వేసుకుంటే మంటల్లో రెక్కల పురుగులు పడి చనిపోతాయి. దీని వల్ల పంటలను చీడ పీడల నుంచి కాపాడుకోవచ్చు.

– ముస్తఫా, వ్యవసాయాధికారి, ధర్మవరం మండలం

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



దామాజిపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా సోదాలు చేస్తున్నపోలీసులు



ఎర్రోనిపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో అనవసరంగా గొడవలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని రామగిరి సీఐ శివాంజనేయులు హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని దామాజిపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అల్లర్లకు ప్రేరేపించే వారు, పాత లిక్కర్ కేసులు ఉన్న వారి ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆ రోజున ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అంతకుముందు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

శాంతిభద్రలకు విఘాతం కలిగించొద్దు

మండల పరిధిలోని ఎర్రోనిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పోలీసులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలో ఇరు పార్టీల వారు శాంతియుతంగా జీవించాలన్నారు.

జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలో ప్రతిభ



నాగచిన్మయి నృత్య ప్రదర్శన

కదిరి టౌన్: జాతీయ స్థాయి నృత్య ప్రదర్శన పోటీల్లో పట్టణంలోని రెవెన్యూ కాలనీకి చెందిన గంగిశెట్టి శ్రీనివాసులు, స్వర్ణలత దంపతుల కుమార్తె నాగచిన్మయి ప్రతిభచాటింది. వివరాలు.. చిలకలూరిపేటకు చెందిన కళానిలయం అనే సాహితీ సాంస్కృతిక సంస్థ 39 ఏళ్లుగా జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన సంగీత, నృత్య కళాకారులకు పోటీలు నిర్వహించి కళలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 21, 22, 23 తేదీల్లో వెంకటేశ్వర కళా నిలయంలో పోటీలు నిర్వహించారు. భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యం సోలో, డ్యూయెట్ విభాగాల్లో నాగచిన్మయి మూడో స్థానంలో నిలిచి ప్రేమ పావురాలు, నాట్య మయూరి అవార్డులను గెలుచుకుంది. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన భ్రమరాంభ నాగచిన్మయికి సర్టిఫికెట్‌ను అందించి అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు హాల్‌టికెట్, ఆన్‌లైన్ మార్కుల జాబితాతో నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందొచ్చని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం, ఒకేషనల్ ఎంఎల్‌టీ, ఈటీ, సెరికల్చర్ గ్రూపులలో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు.

బాట మారెమ్మకు ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో వెలసిన బాట మారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో అమ్మవారిని వందలాది మంది దర్శించుకుంటారని ఆలయ పూజారి తెలిపారు.

ముగిసిన ఏటి గంగమ్మ తిరునాల




బోనాలతో ఊరేగింపుగా వస్తున్న బలిజపేట వాసులు

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేట సమీపంలో ఉన్న ఏటి గంగమ్మ ఆలయం వద్ద నాలుగు రోజుల పాటు సాగిన తిరునాల ఆదివారం ముగిసింది. ఏటా మొలకల పౌర్ణమి సందర్భంగా ఏటి గంగమ్మ తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 23న అమ్మవారికి చీర సారె కార్యక్రమాలతో ప్రారంభమై తిరునాల హరికథా కాలక్షేపాలతో పాటు, బలిజ పేట చాందిని బండి ఊరేగింపు ప్రత్యేక అకర్షణగా నిలిచింది. ఆదివారం బలిజపేట వాసులు బోనాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని సమర్పించారు. అనంతరం జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మండల వాసులే గాక కదిరి, పులివెందుల, ఎన్‌పీకుంట, చక్రాయపేట మండలాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

ధర్మవరం రూరల్: మల్లేనిపల్లిలో కాలువ గంగమ్మదేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 31న అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బంగారు భవానీ, విష్ణువర్ధన్, గంగయ్య, సూరి, ఆది, లక్ష్మీనారాయణ తదితరులు తెలిపారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



కుమ్మరవాండ్లపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నల్లచెరువు: ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లచెరువు ఎస్‌ఐ కే.ఎం. లింగన్న హెచ్చరించారు. కుమ్మరవాండ్లపల్లిలో ఎస్‌ఐ లింగన్న సిబ్బందితో కలిసి ఆదివారం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానం ఉన్న ప్రదేశాలు, పలువురి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నా. ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో పోలీసుల తనఖీలు

నల్లమాడ: ఓట్ల లెక్కింపు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం సీఐ రవీంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాల ఎస్‌ఐలు రమేష్‌బాబు, వంశీకృష్ణ, మగ్బూల్ బాషా తమ సిబ్బందితో కలిసి వంకరకుంట, రెడ్డిపల్లిలో తనిఖీలు నిర్వహించారు. పలువురి ఇళ్లలోను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌సీ, నంబర్ ప్లేట్‌లు లేని 30 వాహనాలను సీజ్ చేసి రికార్డులు పరిశీలించారు. ఎవరైనా ద్విచక్రవాహనం కొన్న వెంటనే తమ పేరున మార్చుకోవాలని పోలీసులు సూచించారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం గూనిపల్లి,సిద్ధరాంపురం,లింగప్పగారిపల్లిలో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య,బుక్కపట్నం ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు తర్వాత శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రికార్డులు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం డి.చెర్లోపల్లి, పత్యాపురం గ్రామాల్లో ఆయన తమ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, మద్యం విక్రయించే వారి ఇళ్లల్లో తనిఖీ చేపట్టారు. రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోదాల్లో రికార్డులు లేని మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రికార్డులు చూపించి వాటిని తీసుకువెళ్లాలని వాహనయజమానులకు సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ప్రజలతో గ్రామసభను నిర్వహించారు. ఎన్నికల ఫలితాల రోజున బాణాసంచా పేల్చడం, చిందులు వేయడం, సంబరాలు జరుపుకోవడం చేయరాదన్నారు. పాతకక్షలు మనసులో ఉంచుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ప్రతిభ



విద్యార్థినులతో శ్రీసత్యకృప మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ధర్మవరం: పట్టణంలోని శ్రీ సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఆల్ ట్రస్ట్ కంపెనీ నిర్వహించిన కంపెనీ డ్రైవ్‌లో విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కరస్పాండెంట్ పెద్దిరెడ్డి తెలిపారు. 100 మంది విద్యార్థినులు కంపెనీ డ్రైవ్‌లో పాల్గొనగా 26 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ప్రతిభచూపిన విద్యార్థినులు అభినందించారు.

12 ద్విచక్ర వాహనాల సీజ్



వెంకటరమణపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గోరంట్ల: మండల పరిధిలోని వెంకటరమణపల్లిలో ఆదివారం సీఐ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని పరిశీలించారు. రికార్డులు సరిగాలేని 12 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

లేపాక్షిలో...

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రంలో ఎస్‌ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని, గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా కార్డెన్ సెర్చ్ నిర్వహించామని ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా గణపతి సచ్చిదానంద జన్మదిన వేడుకలు



గణపతి సచ్చిదానంద స్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గణపతి సచ్చిదానంద 82వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం పల్లకిలో స్వామి చిత్రపటాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని జీవిమాను సర్కిల్ సమీపంలో ద్విచక్రవాహనం పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన వలీ జీవిమాను సర్కిల్ నుంచి మదనపల్లి వైపు బయలుదేరాడు. ఈక్రమంలో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనాథ పిల్లలకు చేయూత



అనాథలకు వస్తువులు అందించిన దృశ్యం

కొత్తచెరువు: అనాథ పిల్లలకు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చేయూతనందించాడు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన అంజనేయులు, చౌడమ్మ దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వీరికి ఇద్దరు కుమారులు శేఖర్, ముత్యాలు, ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, అమ్ములు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు అనారోగ్యంతో మరణించగా అనాథలుగా మిగిలిపోయారు. వీరు పొట్టకూటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. స్థానిక పోలీసులు ద్వారా విషయం తెలుసుకున్న నల్లమాడకు చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు టీడీ కృష్ణసుమన్‌రెడ్డి తన యువసైన్యం సభ్యులతో ఆర్థికసాయంతో పాటు ఇంటికి కావల్సిన ఫ్యాను, మంచం, ఇతర సామగ్రి, దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు అందించాడు. కార్యక్రమంలో అంజి, ప్రసాద్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వండి

ధర్మవరం రూరల్: రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల్లో రుణాలను ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో బ్యాంకర్లను డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని, అలాగే అన్ని రకాల విత్తనాలు, ఎరువులను 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని, కరువు సహాయక చర్యలను చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు.

బడన్నపల్లిలో కార్డెన్ సెర్చ్



బడన్నపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర

ధర్మవరం రూరల్: సమస్యాత్మక గ్రామమైన బడనపల్లిలో ఆదివారం రూరల్ ఎస్‌ఐ నరేంద్ర ఆధ్వర్యంలో కార్డన్ సర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాడుబడిన ఇళ్లు, గడ్డివాములు, ముళ్ల పొదల్లో పోలీసులు తనిఖీలను నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్షన్ అనర్థాలపై ఎస్‌ఐ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. క్షణికావేశంలో ఎవరూ కూడా నేరాలకు పాల్పడొద్దని, ఎవరికైనా అన్యాయం జరిగితే పోలీసులను ఆశ్రయించి చట్టం ద్వారా న్యాయం పొందాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అల్లర్లకు పాల్పడవద్దని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ



పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్

ముదిగుబ్బ: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, హిందీ గ్రామర్, క్యారం బోర్డు, స్నేక్ లాడర్‌ను గ్రంథాలయ అధికారి బొజ్జేనాయక్ నేర్పించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ విశ్వనాథ్, గ్రంథాలయ సిబ్బంది ఖాదర్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపును అందించడం హర్షణీయమని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గోసే రాధాకృష్ణ తన తల్లి గోసే రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజంలో లయన్స్‌క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి కంటిచూపును ప్రసాదిస్తోందన్నారు. శిబిరంలో 90 మందికి కంటిపరీక్షలు చేయగా 40 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పల్లెం వేణుగోపాల్, చెన్నంశెట్టి జగదీష్, గూడూరు రాజగోపాల్, ముక్తాపురం క్రిష్ణ, పీడీలు రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

కనగానపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహాదేవ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన రైతు సంఘం నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం నెలకొన్న కరువు పరిస్థితుల వల్ల పంటలు పండక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది వేరుశనగ పంట సాగుచేసేందుకు విత్తనాలు, ఎరువులు కొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని గుర్తించి ప్రభుత్వం వేరుశనగతో పాటు కంది, ఆముదం, పత్తి వంటి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు గోవిందు, బాలరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.